# కనిపించని ద్వారం

## శ్రీ "త్రిపుర"

మేడమెట్లు ఎక్కి హాల్‌లోకి అడుగుపెట్టేను. పదకొండు సంవత్సరాల నాలుగు నెలల పదిహేడురోజుల క్రితం చూసినప్పుడు ఎలా ఉందో అలాగే ఉన్నాయి హాలూ, హాల్‌లోని వస్తువులూ. బీరువాల్లో క్యూరియోలు. గోడ దగ్గర, కిటికీపక్కగా రేడియోగ్రామ్. కార్పెట్. సోఫాలు అప్పుడున్నట్లుగానే. సూట్‌కేసుల కూడా అవే. దగ్గరగావెళ్లివాటిమీది లేబుల్స్‌చూశాను. పి అండ్ ఒ స్టీమర్ కంపెనీవి, క్వాంటాస్‌వారివి, బి. ఒ. ఏ. సీ.......రోమ్, లాగోస్, జకార్టా. చిన్నవి, పెద్దవి. రంగు రంగులవి. ఫ్రెంచ్, యిటాలియన్, ఇంగ్లిష్ భాషల్లో. అన్నీ పాతవే. ఒకటే కొత్తగా కనిపించింది. థాయ్ ఏర్‌వేస్‌ది.

ఫోర్ పోస్టర్ మంచం మాత్రంలేదు. ఎడమవేపు కిటికీ దగ్గరకువెళ్లి పైకి చూశాను. తోటలో, అవుట్‌హవుస్ దగ్గర కూచుని చిన్నయ్య ఎరువులు కలుపుతున్నాడు. బోగన్‌విలియా. గులాబీల వరస. సీజన్ పువ్వుల బెడ్స్. లాన్‌మోఅర్, కాంపౌండ్ గోడ దగ్గర. దూరంగా వెనకవేపు మూలని మామిడిచెట్టు. లేత ఆకుపచ్చ ఆకులు.

వెనక్కితిరిగి, గోడమీద తగిలించిన ఫోటోల దగ్గరికి నడిచాను. టెన్నిస్ టోర్నమెంట్‌లో గెలిచిన కప్పుపక్క నేను. నేను! ఒరియా జమీందారిణి లాగ అమ్మ. ఇంకా అయిదు ఫోటోలు. ఐదు దేశాల రాజధానుల్లో, ఐదు రకాల మనుషులమధ్య వాళ్లల్లో ముఖ్యుడిగా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కి సంబంధించిన లెప్రసీ ఎక్స్‌పర్ట్‌గా, అందంగా, నవ్వుతూ నాన్న.

టేబుల్‌మీద కొన్ని ఫోటోలు సిల్వర్ ఫ్రేముల్లో. ఒక దాన్లోనేను, పన్నెండేళ్ల వయసులో, చిన్న టేబుల్‌మీదఆ సంవత్సరం నాకు సెయింట్ ఎలోయిషియస్ స్కూలు యిచ్చిన ఆరు ప్రైజు పుస్తకాలతో సహా. ఇంకోదాన్లో ఎవరో నీగ్రో వనిత.

కుడివేపు కిటికీ దగ్గరకువెళ్లి తలుపులు తెరిచి చూశాను. దూరంగా సముద్రం, ఎండలో మెరుస్తూ. పక్కయింటి జడ్జిగారి యింటి కాంపౌండ్‌లోమోటార్ సైకిల్. అతనే ఉన్నాడా యింకా ఆ యింట్లో?

తివాసీ మధ్యకివచ్చి నిలబడి, కోటుజేబులోంచి సిగరెట్ పాకెట్‌తీసి, అందులోంచి ఒకటితీసి వెలిగించాను. మెల్లగా పడేశాను ఆరిపోయిన అగ్గిపుల్ల తివాసీమీద. తోటలో మైనాలు. తల కిందికివంచిచూస్తే తివాసీమీద ఒక పెద్ద మచ్చ. బొఖారా తివాసీమీద విస్కీరంగు మచ్చ. ఆ మచ్చ ఉన్నచోట తివాసీ పలచబడి, కాస్త చిరిగినట్లు కనిపించింది. ఇక్కడే కూచునే వాడినా అప్పుడు? తల పైకెత్తి, రోమ్‌లో తీసిన ఫొటోగ్రాఫ్‌వైపు సిగరెట్ పొగ వదిలాను. ఆ ఫొటోలో కాళ్లు క్రాస్ చేసుకుని చేతులు ఒడిలో పెట్టుకుని, తెలివైన కళ్లతో నవ్వుతూ, నాన్న— అమ్మని గొంతుకు నొక్కి చంపిన నాన్న.

పుస్తకాల షెల్ఫుల దగ్గరకి నడిచాను. లెప్రసీకి సంబంధించిన పుస్తకాలు, బరువుగా. జర్నల్స్. రీడర్స్ డైజెస్ట్ కాపీలు రెండు. రెండో అరలో స్విజర్లాండ్‌నుంచి యిరవయిఅయిదేళ్లక్రితం నాన్న తెచ్చిన బార్తొలోమ్యూస్ అట్లాస్. నూట తొంభయి పేజీలు. సోఫామీద కూచుని సిగార్ కాలుస్తూ నాన్న ఏదో వూరో, నదో, కొండో పేరు చెప్పి ఎక్కడుందో వెతికిచెప్పమని అడిగితే, తివాసీమీద అట్లాస్‌ముందు వేసుకుని బోర్లా పడుకుని కళ్లు చికిలించి వెతకడం. జయం, అపజయం. అప్పుడప్పుడు, ఏడిపించడానికని యిండెక్స్‌లో కూడా దొరకనివి, కల్పించబడివవి.

అట్లాస్ మొదటి పేజీమీద నా పేరు. పన్నెండేళ్ల వయస్సులో రాయబడే దస్తూరీ. కె. నారాయణ. కిందఅరలో చిన్నఅట్టపెట్టె. అందులో దేశదేశాల్నుంచీ వచ్చిన గ్రీటింగ్స్‌కార్డ్సు. కొన్ని ఫోటోలు, చిన్నవీ, పెద్దవీ, ఎందరివో? ఆల్బమ్సు అన్నీ ఎక్కడున్నాయ్? రెండు పాత ఉత్తరాలు.

జోసెఫ్‌వచ్చి మెల్లగా చెప్పేడు. నాకోసం లాయర్ గారు వచ్చారు.

అట్లాస్ పేజీలు మెల్లగా అటూ యిటూ తిప్పి మూసి, "వస్తున్నారని చెప్పు" అన్నాను. జోసెఫ్ వెళ్లిపోయాడు. బుక్‌షెల్ఫ్ పక్క టేబుల్‌మీద స్విస్ కాటేజ్ బొమ్మ. కాటేజ్ చుట్టూ పాస్టొరల్ సీన్. చేతిలోకి తీసుకుని 'కీ' యిచ్చాను. ఆవుపక్కని కూచున్న స్త్రీ పాలు పితకడం మొదలు పెట్టింది. ఎద్దులూ, ఎద్దులవెనక హాలికుడూ. 'కీ' తో ప్రాణం వచ్చింది కాటేజ్‌లో జీవితానికి. వచ్చింది నాకు చిరునవ్వు.

మెట్లుదిగి, హాలుదాటి, కారిడార్‌లోంచి నడిచాను. కారిడార్‌లో గోడకి ఫ్రేమ్ చేసిన పీటర్ బ్రూజెల్ తైలవర్ణచిత్రం ఒకటి ఉంది. ఇంతకు ముందు లేదు. పన్నెండేళ్లక్రితంలేదు. 'ఛిల్డ్రన్ యిన్ గేమ్సు'. నాన్న టేస్ట్ అర్థం అవలేదు.

డ్రాయింగ్ రూమ్‌లో లక్ష్మీనారాయణగారు. పరామర్శ వాక్యాలు—నాన్న గొప్పతనం గురించి. జోసెఫ్ టీ సరంజామా, కేక్సు, సేన్విచెస్. లక్ష్మీనారాయణ గారు ఫోలియో బాగ్‌లోంచి కాగితాలు తీశారు. బరువుగా, విలువైనవిగా, స్టాంపులతో నిండిన కాగితాలు. జేబులోంచి కళ్లజోడు తీసి, కళ్లకి తగిలించుకుని, విచారంగా, అలవాటయిన విచారంతో మెల్లగా చదివారు.

ఆయన చదువుకుపోతూంటే, నేను వాచీచూసుకున్నాను. నవంబరు యిరవయిఆరో తారీఖు. నాన్న 'పోయి' యిరవయిఎనిమిది రోజులయింది అని లెక్క కట్టేను. నేను యిక్కడికి నిన్ననే వచ్చినా చాలాకాలం అయినట్లు ఎందుకో అనిపించింది.

"దయచేసి సంతకాలూ అవీ......"

"దయచేసి టీ తీసుకోండి"

జోసెఫ్ కప్‌లో టీ తయారుచేసి యివ్వబోతే లక్ష్మీనారాయణగారికి— డయబెటిస్, షుగర్‌వద్దు— కేక్ మాత్రం ఒకటి—

యిరవయిఎనిమిది రోజులయింది. నా వయస్సు ముప్పయిఏడు సంవత్సరాలు. మూలనున్న కుక్కూ క్లాక్ అయిదు కూసింది. కిటికీలోంచి దూరంగా పొడుగ్గా వంకరగా వాలుతూ కొబ్బరి చెట్లు. టీ తాగి కేక్ తిన్న లక్ష్మీనారాయణగారికి మళ్లీ నా సంతకాలు కావాలి.

నేను మెల్లగా సిగరెట్టొకటి వెలిగించి— లక్ష్మీనారాయణగారు "థాంక్సుసార్, నా కలవాటు లేదు"— నేను నిన్న రాత్రినుంచి ఆలోచించి చెప్ప దలచుకున్నదేదో చెప్పాను. 'పోకర్' ముఖంతోనే చెప్పాను. మెల్లగా, వ్యాకరణయుక్తంగా, తడబాటులేకుండా.

మా మిగతా సంభాషణ—నేను లాయరుగారితోనూ, ఆయన ఒక వింత కలలో కనిపించిన ఒక మతిచెడినవాడితో అన్నట్లూనూ. ఇంకా కూచుంటే, యిక్కడే కూచుని నా మాటలువింటే, ఆ కలలోని వింతగా మతిచెడినమనిషి, యీ సాయంత్రం సమయంలో, నిజంగానే, కలల్లోంచి.....లక్ష్మీనారాయణ గారు కాగితాలూ అవీ సద్దుకుని వెళ్లిపోయారు, పైన సూర్యుడూ, వెలుతురూ, మనుష్యులూ, నడవడానికి రోడ్లూ ఉన్న ప్రపంచంలోకి, సాయంత్రంలోకి.

కిటికీలోంచి నీరెండ. చెట్లల్లో ఉడతలు. లాన్ మీద చిన్నయ్య రబ్బర్ పైప్‌తో నీళ్ల జల్లు. బీచ్ వేపు మెల్ల మెల్లగా మనుష్యుల నడకలు. మగ, ఆడ జంటలు. చిన్న పిల్లలు. ట్రాన్సిస్టర్లతో కొందరు.

కారిడార్‌లో బ్రూజెల్‌ని మళ్లీ నిలబడి చూసి, మేడమీదికి వెళ్లేను. సోఫామీద కూచున్నాను. ఎదరుగా గోడమీద ఒరిస్సా జమీందారిణి—అమ్మ. పైన సాయంకాలపు వెలుతురు మెల్లగా కరిగిపోతూంది. పక్షులు ఎక్కడికో ఎగిరిపోతున్నాయి. చేతివేళ్లమధ్య సిగరెట్టు కాలిపోతూంది. దూరంగా సముద్రపు హోరు వినిపించీ వినిపించనట్లుగా.

......'ద్వేషం' దేనికి? అమ్మని చంపినందుకా? పొరకింద పొరకింద పొర మెల్లగా విప్పుతుంటే, కారణం అది కాదని తెలుస్తూంది నాకు. ఈ

పన్నెండేళ్లనుంచీ, నన్ను వెంటాడుతూ, నాకు తెలిపింప జేస్తూనేవుంది. పదకొండేళ్ల నాలుగు నెలల పధ్నాలుగో నాడు యీ యిల్లు మూడోసారిగా వదలిపెట్టి వెళ్లిపోయాను ద్వేషంతో.

తరవాత జీవితం?

సైన్యంలో;—మెసపటోమియా, బెంఘాజీ, ట్రిపోలీ, సింగపూర్, కొహిమా; తరవాత మళ్లీ చదువు యూనివర్సిటీలో. చదువు. చదువు! అక్కడ! ద్రోహం చెయ్యడం, చెయ్యబడ్డం; తరవాత 'గాలిపడగ'—పేవ్ మెంట్లమీద, పార్కు బెంచీలమీద; కాశీలో—అక్కడ మిల్క్ మెన్స్ యూనియన్ లో జొరబడి వాళ్ల పాలలో విషం! స్నేహితులకి—భాస్కరం, పాండే—ద్రోహం; శివాజీ, గౌరి, మార్గరెట్—స్నేహితులకీ, ప్రేమించినవాళ్లకీ ద్రోహం. దేశానికి ద్రోహం. అందులోని అందం, ఆనందం. తరవాత మోల్మీన్, తరవాత కబాయే పగోడాలో "అభిధర్మ" చదువు, సాధన! మిజో కొండల్లో గన్ రన్నింగ్. ఒకచోట 'రాజు'. ఇంకోచోట జూడాస్. అక్కడ బెగ్గర్ యిక్కడ బగ్గర్...

అమ్మని అలా దేవుడి పూజామందిరంలో చంపినందుకుకాదు ఆ ద్వేషం అని తెలుస్తూనే ఉందినాకు. నాన్న 'మంచి'గా మాట్లాడేమాటలు, అందరినీ సంతుష్టపరచడానికి ప్రయత్నంచేస్తూ మాట్లాడేమాటలు, 'తీపి' మాటలు, ఆయన పాప్యులారిటీ, హ్యూమర్, వైటాలిటీ ....

యివా కారణాలు? నా ద్వేషానికి యివా కారణాలు?

కాదు, కాదు. కాదు.

తల రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకుని నొక్కుకుంటూ, కళ్లు బాగా గట్టిగా నల్లగా మూసుకుని, కళ్లలోని నలుపులో, చీకటిలో అద్భుతమైన డిజైన్లు క్షణ క్షణానికీ మారుతూ, వెలుగుతూ, ఒకదానిలోంచి యింకోటి కరుగుతూ, కలిసిపోతూ, మళ్లీ మెరుస్తూ, రంగుల రంగులగా మారుతూవుంటే, కారణాలకోసం వెతుక్కోవడం, కారణాలు మెరుపులా నా మనస్సులో ఎక్కడో లోలోపల వెలుగుతాయనీ, వెలగాలనీ, గుండె పగిలేలా కోరుతూంటే, ఆశిస్తూంటే... అవి కళ్ల వెనక నలుపుల్లో, దగ్గరగా, దగ్గర దగ్గరగా వచ్చినట్లేవచ్చి, అందుకోకముందే అదృశ్యమయిపోతాయి; పోయాయి.

జోసెఫ్ వచ్చాడు. లైట్లు వెలిగించమన్నాను. టేబుల్ లైట్స్, పైవీ, మూల మూలల్ని ఉన్న దీపాలన్నీ వెలిగించాడు. ఒకటి తరువాత ఒకటి మెల్లగా. హాలంతా వెలుతురు. అంతా వెలుగు.

"మీ గది తయారు చెయ్యమన్నారా?" అన్నాడు జోసెఫ్.

మంచం తీసేశారు యీ గదిలోంచి. కాని బెడ్ సైడ్ స్టూల్ మాత్రం ఎవరూ కదపలేదు. దగ్గరగా నడిచి వెళ్లాను. స్టూల్ మీద ఒక పుస్తకం. ఎత్తి చూశాను.'డిక్లైన్ అండ్ ఫాల్ అఫ్ రోమన్ ఎంపైర్.'

వెనక్కి తిరిగి, జోసెఫ్ తో అన్నాను 'వద్దు'. ఏభయిఏళ్ల జోసెఫ్, రోమన్ కేథలిక్ జోసెఫ్, నేను ఎక్కడ పడుకుంటానో అడగడానికి భయపడి, ఒక నిముషం నిలబడి, ఆలోచించి, ఏదో అనబోయి, అనకుండా, కిందికిదిగి వెళ్లిపోయాడు.

రేడియోగ్రామ్ దగ్గరకి వెళ్లి కింద అరలో రికార్డులు ఒకటి తరువాత ఒకటి తీసిచూడడం మొదలుపెట్టాను...సైబీలియస్, హాండెల్, బెలాషాంటే—నాకు ఆశ్చర్యం—నర్సరీరైమ్స్, క్రిస్మస్ కేరల్స్...వయొలిన్ కన్సెర్టో. బి. మేజర్ బాఖ్, ట్రంపెట్ కన్సెర్టో హమ్మెల్....సింఫొనీ నంబర్ 6. డి. మైనర్ సైబీలియస్. ఈ. ఫ్లాట్ మేజర్ మోత్సార్ట్...ఇంకా. తిరిగీ అదే వరసలో జాగ్రత్తగా పెట్టేశాను.

కుడివేపు కిటికీ దగ్గరగా వెళ్లి మళ్లీచూశాను. సముద్రంలో స్టీమర్లు దూరంగా, అక్కడా అక్కడా. దీపాలు వెలుగుతున్నాయి వాటిల్లో. హొరైజన్ దగ్గర నిలువుగీత. అస్పష్టంగా, కదలకుండా ఉన్న మేఘాలు, నలుపూ నీలీ.

గదిలో దీపాల్ని ఒకటీ ఒకటీ ఆర్పడం మొదలుపెట్టాను. బెడ్ సైడ్ స్టూల్ పక్కని మాత్రం దీపం ఉంది. దానిమీద పుస్తకం. అలాగే ఉంది. బరువుగా, చాలా రోజులనుంచీ మెల్ల మెల్లగా తెరిచిగా చదవబడుతూ ఉన్నట్లు. ఆ స్టూల్ పక్కని యింకో చిన్న స్టూల్. దానిమీద ఒక బాక్స్ ఆఫ్ సిగార్స్. చేతిలోకి తీసుకున్నాను. హవానా మేజర్స్.

తేలికగా ఉంది పెట్టె. మెల్లిగా మూత పైకెత్తాను. పలచటి నీలికాగితంకింద రెండు సిగార్స్‌మాత్రం ఉన్నాయి. ఒకటి దాని జాగాలో. రెండోది అడ్డంగా. అడ్డంగా ఉన్నదానికి సెల్లోఫేన్ కవర్‌లేదు.

అప్పుడూ,

తివాసీమీద నిలబడి, నేను వెక్కి వెక్కి ఏడ్చింది. ఎంతో గాఢమైన చీకటి లోతుల్లో, నాలో ఏదో తెగింది. దాక్షిణ్యం లేకుండా తెగింది, అప్పుడూ.

*　　*　　*

నారాయణ తలవంచి కిందికి చూశాడు. హేరిస్ ట్వీడ్ ట్రౌజర్స్ బూట్ లేసుల్ని కప్పుతూంది. పక్కకి తిరిగి నిలువుటద్దంలో చూసుకున్నాడు. దేహం చదునుగా, పొడుగ్గా. భుజాలు బలంగా, చాలా వెడల్పుగా. ట్వేల్‌షర్ట్ భుజాల లోపలి గట్టితనంమీద మెరుస్తూ, తెల్లగా నవ్వుతూ, దిగి, ఛాతీమీద గర్వంగా పరుచుకుంది.

సుఖం, సంతోషం నారాయణ గుండెల్లోంచి బుడగల్లాగ పైకి వస్తూవుంటే,

ఏదో లోపలి ఒక లోతులోంచి ఒక పాము బుస మెల్లగా వినిపిస్తూంది. నారాయణకి నిజంగా కోపం వచ్చింది.

"ఆ కళ్ళు నాకు తెలుసు. నేను స్వతహాగా 'మంచి' వాడినని చెబుతాయి. కాని, అలా చెబుతూనే చిన్న విషపు చిలుకు చిలుకుతాయి."

మెదడులో, ఉల్కల వేగంతో రూపం పొందుతుండే ఆలోచనల్ని మొదటినుంచి చివరదాకా అనుసరించగలదు. అతని మెదడులోనిదే యింకో భాగం. ఆ గాలి పడగలాగ ఎగుర్తూ, ఆ గొలుసులూ, ఆ 'పళ్ళెం' ఎగిరిన పారుదలా, ఆ 'అహం'.....తటస్థంగానే.....ప్రతి నిముషాన్ని నిలబెట్టి, కస్టమ్స్ చెక్ చేసినట్లు అటకాయించి, క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా, అనుమానంతో పరీక్షచేసి, వాటి చీకట్లనీ, దాగుడుమూతల్నీ కనిపెట్టి, పైకి లాగగలవు అతని కళ్ళూ, ఆ కళ్లలోని నల్లటి వెలుగూ.

నారాయణ అద్దంలోని తన కళ్లనుంచి అద్దంలోని తన నుదురుమీదికి మరల్చాడు తన కళ్లని. కుడివేపుపాపిట దగ్గర గరుకుగా నల్లటి పుటుమచ్చ.

"అది నాది. నా పుట్టుమచ్చ అది. అంటే అది 'నేను'. నన్ను యీ ప్రపంచంలో 'యిది నువ్వు' అని చెప్పేది. అంటే?"

నారాయణ కుడికాలి వేళ్లమీద నిలబడి గిఱ్ఱున తిరిగాడు. తిరిగి, తిరిగి, తిరిగి అద్దానికి ముప్పయి డిగ్రీల కోణంలో తూలి తూలి తూలి మెల్లగా స్థిరబడ్డాడు. గోడలు తిరిగాయి. కళ్లల్లో—రోప్, సిగార్స్, కిటికీలో స్టీమర్.....మంచంలేని ఖాళీజాగా... నుదుటికి చమట. జుత్తులో ఒక భాగం నుదురుమీద పడింది మెత్తగా, చెమ్మగా. అద్దానికి దగ్గరగావెళ్లి కుడి బుగ్గ అద్దానికి ఆనించి, కళ్లు మూలకి—అద్దం వేపుగా—తిప్పి చూశాడు. ముక్కు 'వాలు' కనిపిస్తూంది, బుగ్గ పక్కగా, అద్దంలో.

"ఖద్దర్ టెక్స్చర్ లాగుంది" అనుకున్నాడు.

"ముక్కు చివర మొనదేరి ప్రపంచాన్ని అన్వేషిస్తూంది. అది కూడా నేనే" అన్నాడు, మెల్లగా, స్వరాన్ని కీచుగా చేసి.

"అది కూడా నేనే."

దువ్వెన తీసి జుత్తునంతా కిందికి దువ్వేడు. తలమీద నల్లటి జలపాతం. నల్లటి నాలుక, పామేడ్ మెరుపుతో. రెండు బుగ్గల్నీ పట్టుకుని పక్కకిగట్టిగా లాగేడు. పెదిమలు విడి ఎర్రబడ్డాయి. ముక్కు రూపాన్ని మార్చుకుంది. కళ్లు మాత్రం అలాగే; మారలేదు.

"రింగోస్టార్ లాగున్నావు"

"నాండర్థాల్ మనిషి లాగున్నావ్."

"ఇంకా?"

"అసలు 'నేను' ఎవరు?

"మిలియన్ బిలియన్ స్పెర్మటోజోవాలో ఒకటి.....ఒకటి.....దానికి ఛాన్స్ వచ్చింది."

"అన్నదెవ్వరు అలా?"

"ఫస్ట్ పిలాసఫర్స్ సాంగ్"

"అది నిన్ను......నిన్నూ"

"కాకపోతే, నువ్వెవరివి? నువ్వెవరివి?

"ఏ నీచేవో, ఏ వాల్మీకివో, ఏ హో ఛిన్ మిన్ వో...'

"—పెరూ అగ్ని పర్వతాల వాలుల్లో, వెర్మో యాన్స్కి మంచు చరియల్లో, గ్రెనడా వేడిలో"

"ఇంకా, యింకా, చెప్పు."

"—లాసా మొనాస్టరీలో,కార్థూసియన్ మాంక్ లాగ, నియోపొలిటన్ ఫిషర్‌మన్‌లాగ—"

"—కాస్టనెట్స్ వాయిస్తూ, ట్రోంబోన్ హూపుల్లో—"

"—కోరల్ ఐలండ్స్‌లో రీఫ్స్‌మీద—"

"ఇంకా యింకా."

నారాయణ కళ్ళు మూసుకుని గట్టిగా నల్లగా మూసుకుని, గబ గబ గబ జుత్తు పైకి దువ్వడం మొదలుపెట్టాడు.

"ఇంకా చెప్పు."

"—కింబర్లీ వజ్రపు గనుల్లో, బ్లాక్ ఫారెస్ట్ లో, లాషియోలో— లాషియోలో ఏమిటిచేస్తావ్? (లాషియోలో ఏమిటి చేశాను?)-లాషియోలో నల్ల మందు స్మగ్లింగ్. ఎలాగ? బర్మా జీపుల్లో, కాలికింద నల్లమందు పాకెట్లు. ఫ్రాంటీర్‌లో ఛేకింగ్....... టైర్లు విప్పి వెతికారు. నేను నవ్వు......నేను మాంగ్ టిన్ మాంగ్....యింకా యింకా-నా డ్రెస్ చెప్పు.తైపో ఏంజీ, లోంజ్యీ, గాంగ్‌బాంగ్, చెప్పులు.

ఆ చెప్పులు? వెల్వెట్ పట్టాలవి. నా కళ్ళు? 'ఇలాగా'అని కళ్ళు చిన్నవిచేసి,చికిలించి, హోరియంటల్‌గా పెట్టాడు నారాయణ.

"కాని, ఆ బిలియన్ మిలియన్ స్పెర్మాటో జోవాలో నీకు వచ్చింది ఛాన్స్. నీకు" అనుకున్నాడు.

"చెప్పు, చెప్పు వేగంగా చెప్పు"

"ఇక్కడ" అని మెల్లగా అన్నాడు అద్దంలో తనతో.

"యిక్కడ....యీ హూళ్ళో....యిక్కడ కిటికీ లోంచి బంగాళాఖాతం. సముద్రంమీద ఎస్. ఎస్. టొట్టోరి మారూ......టోకియో, యోకొహామా వెళ్లేది......"

"తగ్గు. తగ్గు తగ్గు. గుర్రం కట్టు. నువ్వు యిక్కడ. ఈ రోజు. ఈ గదిలో.ఇటుకలు. రాళ్లు. సిమెంట్.గోడలకి నీలిరంగు సున్నం.లేత నీలి. చల్లగా. కొంచం చలిగా. తివాసీమీద యీ మచ్చ. విస్కీరంగు. నువ్వు"

"నా తండ్రెవరు?"

వద్దు వద్దు.

"నా తల్లెవరు?"

వద్దు. చెప్పకు.

"అక్కలున్నారా? అన్నలో? బంధువులు?"

వద్దు వద్దు. వద్దు చెప్పకు.

అనుమానంగా మళ్లీ అద్దంలోకి చూసి, యిలా అన్నాడు.

"వెనక్కివెళ్లి చెప్పు.చిన్నప్పుడు నాకు కావలిసినవి చెప్పు"

పదకొండో ఏడులో జూన్ నెలలో—చినుకులు-విశాలని సంపెంగ చెట్టుకింద ముద్దు పెట్టుకున్నావు. పదమూడో ఏడులో 'మోర్టల్ సిన్'. పదిహేనూ, పదిహేడులో నీకు స్పష్టంగా తెలియని కారణాల వలన గృహత్యాగం చేశావు. తిరిగి వచ్చావు. పంధొమ్మిది; నీ గదిలో పడుకుని షెర్లాక్‌హోమ్స్.: మార్క్ ఆఫ్ జారో......డోరియన్ గ్రే......ఆంద్రీ జీద్.... కలిపి కలిపి.....కార్టూన్ బొమ్మల సేకరింపు. మధ్యలో స్టాంపుల ఆల్బమ్, వందలు, వేలు, వేలకొలదీ స్టాంపులు. జోళ్లని పాలిష్ చేసి చేసి మెరిపించడం— వైల్డ్ వెస్ట్ హీరోలాగ నడవడం, మూడో అంతస్తు డాబామీద వెదుళ్లతో యుద్ధం...పళ్లు బిగించి వెదురుకత్తులురుళిపించి....బీచ్‌లో రక్తాలొచ్చేటట్లు కుస్తీలు, ఫుట్‌బాల్. రత్నప్రసాద్‌మీద వెండెట్టా.....

"ఇంకా". అన్నాడు నారాయణ కళ్లతో. అద్దంతో.

అలసిన రాత్రులలో నీ అమాయకపు నిద్రలు నీకు తెలియకుండానే మాయమయి పోయాయా? మెల్లగా నీ 'దేహాన్ని' నువ్వు తెలుసుకున్నావా? తెలుసుకుని 'సిగ్గు' పడ్డావా? భయపడ్డావా సిగ్గుపడి? బెదిరావా భయపడి? మాటల అర్థాల్నీ, పుస్తకాల్లో గీతల

మధ్య అర్థాల్నీ వెతికావా? 'స్త్రీ' దేహాన్ని కొత్తగా చూడడం, బేధాన్ని తెలుసుకోవడం...కలిపి కలిపి......

కొన్ని చెట్లు ఆకులు రాల్చుకున్నాయి. కొన్ని రాళ్ళు వర్షంలో అరిగిపోయాయి. నేల ఎండి బీటలు. గర్జించే సంద్రం రోడ్లను కబళించింది. కొన్నిగోడలు శిధిలం అయాయి. కొన్ని పరిస్థితులు జ్ఞాపకాల రూపంగా మాత్రమే మిగిలాయి.

నిన్ను 'నువ్వు'గా తెలుసుకున్నావు. తెలుసుకున్నవాడివి, నీ 'వారసత్వం' యిదీ అని తెలుసుకున్న వాడివి, దాని రూపాన్ని మార్చడం, దాన్ని ధ్వంసం చెయ్యడం పనిగా, ధ్యేయంగా పెట్టుకున్నావు. అమ్మలు, నాన్న, అక్కలు, బంధువులు.....ఎవరు వీరు? సంబంధం? వీళ్లా? యిదా? యిలా నేను వాళ్లతో ఉండాలా? అలా మాట్లాడాలా?వాట్నన్నిటినీ తెగ్గొట్టు. అవన్నీ అలాకాదు. అవన్నీ యిలా. దండంపెట్టి మొక్క వలసినవాడిని మక్క లిరిగేటట్లు తన్ను. లాలించి బుజ్జగింపదగినవాడా వీడు? వాడి బుర్రని మెత్తగా ఒత్తేయ్. నమ్రతగా, బుద్ధిగా మాట్లాడాలా యీ రాయితో? టెంకిమీద జెల్లకొట్టు గాడ్దె కొడుక్కి.

"ఇంకా చెప్పు, నా 'చరిత్ర'". అద్దంలోని కనుపాపలతో నారాయణ.

"వద్దు. ఆ చరిత్ర మాసిపోనీ, మసి అవనీ". అన్నాడు, మళ్లీ నారాయణ, తీవ్రంగా, ఆత్రుతతో.

"ఈ రోజే ఎందుకు ఎన్నుకున్నావ్? అది చెప్పు"

ఉదయం నిద్రకళ్లు తెరవగానే తోటలో కొబ్బరి మట్టల గలగల.కొబ్బరి ఆకుల్లోంచి చురుగ్గా సూర్యుడు. చురుకులోని చిరుచలి. దూరంగా ఉరికే సముద్రపు టలలు. వాటిమీద కొంగలు, రెండు. దూరంగా, వీధిలో 'తోటకూర' కేక. ఆ క్షణంలోనే ఎన్నుకున్నావ్ యీ రోజుని.

"కాని, ఎందుకు?" నారాయణ జుత్తు మళ్లీ కిందికి గబగబ దువ్వేడు. చెవులు పట్టుకుని, రెండూ పక్కకి వంచాడు. "చెవల పిల్లి....నల్ల గుల్లలు" ముఖం యిసుక పరిచినట్లు గరుకుగా.

"ఎందుకు యీ రోజు ఎన్నిక?"

వీధిలోని తోటకూర కేక త్రాచుని నీ ంగా ఎన్నికవైపు దిగలాగింది, బరువుగా.

"ఇది నీ దృఢ నిశ్చయమా, నారాయణా?" అద్దంలోని నారాయణ జుత్తు ఊగింది. 'అవును' అంటూ. నారాయణ నవ్వేడు అద్దంలో.

"పద పద పద" అన్నాడు, నారాయణ.

"జోళ్లు తొడుక్కో" అన్నాడు నారాయణ.

"స్టుపిడ్. జోళ్లు తొడుక్కునే ఉన్నాను."

"పాలిష్"

నారాయణ నవ్వి, "యివాళ జోళ్లకి పాలిష్ ఏమిటోయ్?" అన్నాడు.

కాదు. చెయ్యాలి పాలిష్.

దట్టంగా పట్టించాడు నల్లగా ముద్దలు ముద్దలుగా పాలిష్. బలంగా, గట్టిగా, బ్రష్‌ని పట్టు కున్నాడు నారాయణ.

జోళ్లు అద్దంలాగ, క్రిస్టల్ గ్లాస్‌లా మెరిశాయి.

"మేజోళ్లు?"

నైలాన్‌వి. నీలివి. తొడుగు.

టక టక. ట్విల్‌షర్ట్. హారిస్ ట్వీడ్ట్రౌజర్స్—జాన్ బ్రవున్ షూ. కాంతి జోళ్లమీద.మెరుపు. ట్విల్ షర్ట్ తెల్లటి మీగడ తెలుపు మెరుపు.

సూర్యకిరణాల్లో దుమ్ము కణాల ఎగురుడు.

"పద, పద."రక్తంలో జోరు. ఆ జోరులోనే రక్తపు చల్లదనం. నరాలు వేడి. ఆ నరాల వేడిలోనే ఆ నరాల చల్లదనం.

తలుపు తెరిచి, మెల్లగా పైకి అడుగుటట్టాడు నారాయణ. లాన్ చుట్టూ తిరిగి, తోటదాటి, గేటు తీసుకుని పైకి వచ్చాడు.

తన యింటివేపు, వెనక్కి తిరిగి, తన మేన్షన్ వేపు చూశాడా నారాయణ?

లేదు. చూడలేదు. నడవడం మొదలుపెట్టాడు.

కంకర, తారురోడ్డు, బోగన్‌విరియా, సంపెంగ—ఎత్తుగా, పచ్చటి పువ్వులతో—డాబాల మీద తెల్లటి బట్టలు, ఆరవేసినవి.

మలుపు తిరుగు,

కంకర, తారురోడ్డు. తాటాకుల పాకలు.ఆవులు. కొళాయి. మ్యునిసిపల్‌వారిది.

నవ్వులు, నవ్వే మనుషులు. కల్వర్ట్. వరండాల మీద కుర్చీలు, ఆకుపచ్చవి, బెత్తువి. ఇనపవి.నోట్లో చుట్టలు.

నడు, నడు.

నల్లగా, వేడిగా తెల్లటి బట్టలమీద యిస్త్రీ పెట్టెలు. మండే బొగ్గులు.

నడు.

మందులు. పెద్ద పెద్ద సీసాల్లో టాఫీలు.

ఇంకో మలుపు తిరుగు. నడు నడు.

వాలుగా, తారురోడ్డు. నడు, నడు, దిగు. పద.

ఇంకో మలుపు.

హఠాత్తుగా సముద్రం. నీలిదీపం. క్రోస్టల్ బేటరీ. సెంట్రీలు.

దిగు. ఆగు. దిగు దిగు.

నాగుపాములాగ మెల్లగా దిగు.

నడు. టకటకా కాదు. మెత్తగా. కంకరమీద కరకర.....

చూడు. రోడ్డుని కబళించింది సముద్రం. ఏనుగుని మొసలి లాగినట్లు.

పద. నీలిదీపం. లాగిపడేసింది సిమెంటు బ్లాకుల్ని సముద్రం.

రాళ్లు. సిమెంట్ బ్లాక్స్. జాగ్రత్త.

జాగ్రత్త!

కుషన్‌లాగ యిసుక. ఇక్కడ దిగు. ఎన్ని మిలియన్ మిలియన్ బిలియన్ల రేణువులు యివి? 'అంటుకోకుండా'! దగ్గరగాఉన్నా, అంటుకోకుండా.

'పద, పదా.'

తడిగా, నీలి నలుపు యిసుక యిక్కడ. దగ్గరగా. అంటుకుంటూ. కెరటాల అంచుల పొంగులు యిక్కడ, తెల్లగా; మాసిన తెలుపు.

శంఖాలు, లింపెట్స్, మ్యూరెక్స్, పావులు, గుల్లలు, ముక్కలు ముక్కలుగా విరిగిన గుల్లలు, మస్సెల్స్,కాకుల్స్, విరిగినగవ్వలు.మంచివి, ఫోలాస్... కెరటాలు విసిరి పారేసినవి. పోర్చుగీస్ మేన్ అఫ్ వార్, సీ కుకుంబర్.....పావులు. రంగులు, యింద్రధనుస్సు రంగులు. గీతలు. చారలు. ప్రకృతి చేసిన నగిషీలు, చమక్కులు.గుల్లల మెరుపులు. శంఖాల్లోరహస్యాలు...

మెత్తగా తడిగా నలుపూ, నీలీ, బంగారం రంగు యిసుక. పాదాల జాడలు. పెద్దవి, చిన్నవి. జోళ్లవి. గజిబిజిగా ఒకచోట. గజిబిజి పాదాల జాడల గుంపు లోంచి వేరుపడి ఒక జత పాదాలు దూరంగా పోతున్నాయి......

పీతలు, అడ్డుగా, భయంగా, వేగంగా కన్నాల్లోకి.

పీతల పరుగులు.

ఒక కన్నం దగ్గర నిలబడ్డాడు నారాయణ. కన్నం చీకట్లోంచి కాళ్లు సగంపైకిపెట్టిచూస్తూంది.

"నా చేతిలో నీ ప్రాణం ఉంది" అన్నాడు మెల్లగా, కన్నానికి దగ్గరగా వంగి నారాయణ పీతతో.

"నీ బాధలు నీవి" అన్నాడు, గట్టిగా.

పీత లోపలికి కాళ్లు లాక్కుంది.

వంపు తిరిగిన 'బే'. కొండ. డాల్ఫిన్స్‌నోస్.

కొన్ని జ్ఞాపకాలు గుంపుగా, గుంపులు గుంపులుగా ఏదో సువాసనతో ఒక్కసారిగా విజృంభించడం మొదలుపెట్టాయి.

"తెగ్గొట్టు. పక్కకి తోసేయ్. పద పద.'

తీర్థపు రాళ్లు. నల్లగా, తడిగా. కిందని దగ్గరగా నాచు. పచ్చని దూదిలాగ ఊగుతూంది నాచు. చిన్న చిన్న పూల్స్. స్పష్టంగా, నిర్మలంగా నీళ్లు. అడుగున నాచు. సీ వీడ్స్. వేలకొలదీ గుల్లలు. చిన్నవి. చిన చిన్నవి.

"దేముడు!" అన్నాడు, ఆశ్చర్యంగా నారాయణ. నీళ్లలోకి చూస్తూ, అడుగునఉన్న గుల్లలవేపుచూస్తూ.

ఉప్పెనలాగ వచ్చింది నవ్వు నారాయణకి.

"పద."

జాగ్రత్తగా రాళ్లు ఎక్కాడు.

"జారుతావు జాగ్రత!"

"ఏమిటీ తీర్థం? ఎలా తయారయాయి యీ రాళ్లు? ఎప్పటివి?"

కోసుగా, ఎత్తుగా, అడ్డదిడ్డంగా యీ రాళ్లు. అక్కడక్కడ సూదిగా. అహంభావంతో 'నువ్వు నామీద కాలు పెట్టలేవు' అన్నట్లు.

"మెల్లగా ఎక్కు."

రెండు కాకులు చుట్టూ తిరిగాయి. చెత్త కోసం. చచ్చిపడిన చేపలకోసం.

జెల్లీ ఫిష్‌లకోసం.

కత్తెర కెరటాలు. నల్లగా దూరంగా లోలోపల ఎత్తు ఎత్తుగా తయారవుతూ, నిండు నిండుగా కదులుతూ కదిలి కదిలి వూపు వూపుగా వస్తూ, ఒక్కసారిగా, పగిలి పగిలి, పళ్లు యికిలించినట్లుగా, వెక్కిరించినట్లుగా నవ్వుతూ,

హోరు!...

గాలి. ఒకటే గాలి. చెమ్మగా. ప్రాణానికి హాయి గొలిపే వోజోన్.

షర్ట్ కాలర్ ఎగిరింది.

దూరంగా, చదునుగా నీలి నీళ్లు. సూర్యకాంతిలో నీలి అంచు ఎర్రటి మెరుపులు నీరూ ఆకాశం లేత నీలిగా. మేఘపు తునక ఎత్తుగా, ఏకాంతంగా, ఏ విలువా లేని దాని లాగ.

కెరటం ఉద్ధుతంగావచ్చి, తుప్పర. ఉప్పగా పెదవులమీద.

స్థిరంగా, విగ్రహంలాగ నిలబడ్డాడు నారాయణ. ఎత్తుగా, కోసుగా, నల్లటి తీర్థపురాయిమీద. చుట్టూ, నవ్వే కెరటాలు ప్రదక్షిణ చేస్తూంటే. కాకులు కెరటాల అంచుల్ని వెతుకుతున్నాయి. నల్లటి నూగు ముఖం పైకెత్తి, మెడ పక్కకివంచి చూసింది ఒక కాకి. తుప్పుపట్టిన యినప తలుపు తెరిచినట్లు అరిచింది రెండోకాకి. ఒకటి లేచింది.

ఫ్ల ఫ్ల ఫ్ల రెక్కల చప్పుడు.

దగ్గరగా వాలింది. నారాయణకు దగ్గరగా.

వాలి, కాళ్లు సర్దుకుంది తడిగా జారుగా ఉన్న రాయిమీద.

"ఎందుకు" అన్నాడు నారాయణ గాలిలోకి.

కెరటాల హోరులో, అపస్వరాల అలజడిలో, లోన, లోలోన నిశ్శబ్దం.

"ఎందుకు?" అని, ఊపిరిని ఆపి, మళ్లీ అడిగాడు, కళ్లు సగం మూసి,

కెరటాల నవ్వు వేపు చూస్తూ.

అప్పుడే విరిగి బద్దలయిన కెరటం, రాయి చుట్టూ. సుడి తిరిగింది రాయి చుట్టూ, ఆహ్వానిస్తూ, తెల్లటి 'కుచ్చిళ్లు' రాయిచుట్టూ, పరిచి.

"ఎందు...కూ?' అని, గట్టిగా అరిచాడు, చెవులు మూసుకుని. శబ్దం గొంతుకలోంచి, యూస్టేషియన్ నాళాల్లోంచి, చెవుల్లోకి, మూయబడిన చెవుల్లోకి వెళ్లి అక్కడ ప్రతి ధ్వనులు వెతుక్కుంది.

"తంతాను...ఫో" .అని, ఎడమకాలు ఎత్తి, విసురుగా ముందుకు విసిరి,

కుడికాలు,

గట్టిగా, రాయిమీద, అడ్డుగా,

తిప్పి,

అడ్డం తిరిగి,

బలంగా,

వూపిరిని బిగబెట్టి,

ఆకాశపు నీలిలో అకస్మాత్తుగా గీసిన చాపం లాగ

ఎగిరి, వెనక్కి తిరిగి ఎగిరి

గెంతేడు, నవ్వే, కెరటపు హోరులోకి.

---